# నిజస్వప్నం

★

రచన : శ్రీ పరిణం రామచంద్రమూర్తి



లాస్ట్ అవర్ లీజరు కావడంవల్ల యూనివర్శిటీ నుంచి బయటపడ్డాడు రఘు. అతను ఎమ్. కామ్. ఫైనలియర్ చదువుతున్నాడు. తిన్నగా హాయ్‌బీచ్ వైపు నడక సాగిస్తున్నాడు. ''ఈ సంవత్సరంతో తన శ్రమ ఫలిస్తుంది. ఇన్నాళ్లూ అమ్మ తన్ని అష్టకష్టాలుపడి చదివించింది. కొద్దికాలంలో తను డిగ్రీహోల్డరవుతాడు. తన కష్టాలన్నీ గట్టెక్కుతాయి. అదృష్టంబాగుంటే వెంటనే ఏ లెక్చరర్ గానో ఉద్యోగం దొరకవచ్చు. లెక్చరర్ గా కాకపోయినా మరేదయినా కంపెనీలో దొరికినా దొరకవచ్చు. ఎక్కడయినా కనీసం అయిదువందలకు తక్కువ ఉండదు జీతం. తనూ అమ్మా దర్జాగా రాజుల్లా బ్రతకవచ్చు. పాపం నాన్నగారు పోయినదగ్గరనుంచి ఎన్నో కష్టాలకోర్చి తన్ను పెంచి పెద్దవాణ్ణి చేసింది. ఆమెనింక సుఖపెట్టాలి. తన ఊహలకి అతనికే నవ్వువచ్చింది. ఏదో సామెత చెప్పినట్లు 'అలూ లేదూ చూలూ లేదూ కొడుకుపేరు సోమలింగడట' ఇంకా తన చదువు పూర్తికావాలి, ఉద్యోగం దొరకాలి అప్పుడు అదయినా నెల తరువాతకదా జీతం తన చేతికి వచ్చేది. అయినా తన అర్హతకి తగ్గ ఉద్యోగం దొరుకుతుందని నమ్మకమేమిటి? ఈరోజుల్లో ఎంతమంది పెద్ద పెద్ద డిగ్రీ హోల్డర్లే చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నారు. అయినా నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోతూన్న ఈ రోజుల్లో, ఇలా చదువైన వెంటనే అలా ఉద్యోగం ఎక్కడ దొరుకుతుంది. ఎంప్లాయ్‌మెంటు ఎక్ఛేంజిలచుట్టూ ఎన్నిసార్లు తిరగందే, ఎన్నిజతల చెప్పు లరగందే దొరుకుతుంది ఉద్యోగం, ఉద్యోగం దొరకటం అంటే మాటలా! దాని కెంత కాంపిటిషన్ ఈ రోజుల్లో. సిన్సియర్ గా మెరిట్ చూసి ఎక్కడిస్తున్నారు. వాళ్ళకావలసిన వాళ్ళకి, పైగా పెద్ద రికమండేషన్ ఉన్న వాళ్లకితప్పించి, తనలాటి సామాన్యుడికి మెరిట్ తప్ప మరే అర్హత లేని వాడి కెవరిస్తారు. పైగా ఎంతోమంది ఇంజనీర్లు, డిగ్రీ హోల్డర్లు, డాక్టరేటు పట్టా ఉన్నవాళ్లు వేలకివేలుమంది ఉన్నారు నిరుద్యోగంగా. తనూ ఆ కోలాదిమంది లిస్టులో చేరిపోతాడేమో. పూర్వకాలంలో యజ్ఞం చేయటమంటే ఎంతో కష్టతరమైన పని అనీ, అది చేస్తే పెద్ద ఘనకార్యంచేసినట్లు చెప్పుకొనేవారు. ఈరోజుల్లో ఉద్యోగం సంపాదిస్తే అదే పెద్ద ఘనకార్యం చేసినట్లు. 'ఉద్యోగం పురుష లక్షణమ్' అన్నారు పూర్వం రోజుల్లో. కాని ఇప్పుడో 'పురుషుల్తో సమానంగా మేము ఉన్నాం' అంటూ తయారవుతున్నారు ఉద్యోగాలకి స్త్రీలు.

''ఒకే మనతో సమానంగా స్త్రీలుకూడా ఉద్యోగాలికి తయారవటంవల్ల నేరా మనకి ఉద్యోగాలు లేకుండా పోయాయి. అందుకే ఈ నిరుద్యోగ సమస్య ఇలా పెరిగిపోతోంది. అందుకే అంతమంది డిగ్రీహోల్డర్లు, ఇంజనీర్లు, చేతులు, కాళ్లు చాపుకూర్చోవలసి వచ్చింది.''— అంటాడు వెంకటేశం.

''అయినా ఉన్నపోస్టులేకొన్ని, అందులో షెడ్యూల్డు కేస్టు రిజర్వేషన్లు షెడ్యూల్డుట్రైబ్ రిజర్వేషన్లు ఎక్స్‌సర్వీస్ మేన్ రిజర్వేషన్లు, స్త్రీలకి కొన్ని రిజర్వేషన్లు, అందులో పనిచేసే ఎంప్లాయీస్ సన్స్ కి రిజర్వేషన్లుపోను మిగిలిన రెండో మూడో రికమండేషను కేండిడేట్సుకి రిజర్వుడు. అందుచేత ఎలాదొరుకుతాయిరా మనకి. మనం అందులో ఏ కేటగిరీకి చెందనివాళ్ళ మయిపోయాం'— అంటాడు ప్రకాష్.

ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాతల చచ్చినట్లు, ఎంతో కష్టపడి, అనేక వ్యయప్రయాసల కోర్చి పెద్ద చదువు చదివి ఏ చిన్నఉద్యోగం చేయడానికి 'నామోషీ' అక్కడ 'డిగ్నిటీ' అడ్డొస్తుంది, మన అర్హతకు తగ్గ ఉద్యోగం ఎలాగూ లేదూ పోనీ మానాభిమానాలు చంపుకొని ఏ చిన్న ఉద్యోగానికైనా అప్లికేషన్ పెడితే వెంటనే 'రిజక్టు' చేసేస్తున్నారు 'ఓవర్ క్వాలిఫికేషన్' అంటూ—

ఇక్కడో గొప్ప చిక్కొచ్చి పడింది. అర్హత ఉన్న వాళ్ళకా దొరకదు. పోనీ 'మనకు కొంచం క్వాలిఫికేషనుంది కదా' అని ఎవరైనా ఎప్లయిచేస్తే వాళ్లు అసలే పనికిరారు.

''స్వాతంత్ర్యం వచ్చిందగ్గర్నుంచి మనదేశం ఏంట

యిప్పుడు సాధించింది ప్రగతి అంటే అది జనాభా పెరగటం లోనూ, నిరుద్యోగ సమస్యలోనూ. ఈ రెండూ రోజురోజూ విపరీతంగా పెరిగిపోతున్నాయి మన దేశంలో" అంటాడు సుందరం.

"సోషలిజమ్, సమానత్వం అనే ఈ మాటలు ఉపన్యాసాల్లో వినవస్తాయి కాని ఆచరణలో మచ్చుకైనా కనిపించదు. ఏమిటో మన గాంధీజీ కోరుకున్న మరో ప్రపంచం ఎప్పటికొస్తుందో ఏమో. ఆయన కలలు, ఆశయాలు అట్లాగే ఉండిపోతాయేమో"

రఘు తిన్నగా వెళ్లి బీచ్‌లో నీడగా ఉన్న ఓ చోట కూర్చున్నాడు. మిట్టమధ్యాహ్నమయినా సముద్రతీరాన చల్లని గాలివీచి ఎంతో హాయినిగొల్పుతుంది. ఆ ప్రశాంత వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంది. సముద్రం మీంచి వచ్చే చల్లని గాలి అతని మనస్సులో వేడిని తగ్గించడానికి విఫలప్రయత్నం చేస్తూంది. కెరటాలు ఒకదాని వెనుక ఒకటొచ్చి ఒడ్డున ఉన్న రాళ్ళను తాకి మీదికి ఎగురుతున్నాయ్ ఎన్ని అవాంతరాలు వచ్చినా మేము మాత్రం కర్తవ్యం విస్మరించం అన్నట్లు.

ఎప్పుడయినా మనస్సు బాగా లేనప్పుడు, ఇటువంటి ప్రశాంత వాతావరణంలోకి వెళ్ళటం రఘుకి అలవాటు. చల్లగా ప్రశాంతంగా ఉన్న సముద్రపు టొడ్డున కూర్చున్నా అతని మనసులో మాత్రం తీరని వేదన జ్వాలప్రజ్వరిల్లుతుంది. సముద్రగర్భాన బడబాగ్నిలా.

ఎలాగైనా డబ్బు సంపాదించాలి. ఇదే అతని మనస్సులో వేదన. ముందు పరీక్షఫీజు కట్టెయ్యాలి. దానిమీదే ఆధారపడి ఉంది తన భావిజీవితమంతా. ఇప్పుడు మధ్యలో చదువాగిపోతే ఎటుకాకుండా అయిపోతాడు. అదీకాకుండా కొంత డబ్బు రూమ్ రెంట్ క్రింద బాకీ ఉన్నాడు మొత్తం తనకు కావల్సినవి ఎనభై రూపాయలు. ఎక్కడ సంపాదించా అన్నదే సమస్య. పోనీ ఎవర్నయినా స్నేహితుల్ని అడుగుదామా' అంటే అభిమానం అడ్డొస్తుంది. స్నేహితుల్ని చేయి చాచి అడగాలి. తన పరిస్థితులన్నీ విడమరచి చెప్పాలి, అయినా నోరు తెరచి తన తోటి స్నేహితుల్ని అడగటానికి ఓ విధమైన బలహీనత అడ్డొచ్చింది. ఒకవేళ లేదంటే, బాధపడాలి. అడిగి లేదనిపించుకోలేకన్నా అడగకుండా ఉండటమే ఉత్తమం.

పోనీ రంగారావుగార్ని అడిగితేనో. ఛ ఛ ఆయన దగ్గర తన కసలు మొహమాటం. పోనీ స్నేహితుడి కొడుకు కదా అని తనింట్లో రూమ్ ఇచ్చి ఏదో పార్ట్‌టైం జాబ్ చూపించితే. ఆయనకే బాకీ ఉన్న రూమ్ రెంటు గురించి తిరిగి ఆయన్నే అప్పు అడగటమా!

ఎలాగైనా సరే డబ్బు ఎక్కడైనా పుట్టించాలి. ఎక్కడ అప్పు తేవడం అన్నదే సమస్యగా తయారైంది. ఇన్నాళ్ళూ తను ఎవ్వరిదగ్గర చేయి చాచకుండా గడచిపోయింది. కాని ఎల్లకాలం పరిస్థితు లొకలా వుండవుగదా. "సాక్షాత్తూ ధనాదిదేవత లక్ష్మీదేవికి భర్త అయినటువంటి విష్ణువే పరిస్థితులకు తలొగ్గి, కుభేరుడి దగ్గర చేయి చాచి అప్పడిగాడు." అటువంటిది తనలాటి సామాన్యుడు అప్పు చేయడంలో వింత ఏముంది. మానవుడు పరిస్థితులకు బానిస.

కాని ఎవ్వరినైనా చేయి చాచడగటానికి అభిమానం అనేది అడ్డొస్తుందే. మానవుడికి, ఈ అభిమానం అన్నది ఎందుకు పెట్టాడో దేవుడు. ఆ ఆత్మాభిమానమే లేకపోతే తిట్లు, మాటలూ ఎవ్వరినీ ఏమీ బాధించకపోవు. ఎవ్వరినైనా చేయి చాచి 'దేహీ' అని ఏదైనా అడిగేయొచ్చు.

పోనీ, తన ప్రొప్రైటర్ని అడిగితేనో. ఆయన మంచివాడే కాని ఎలా అడగటం. చిన్న పనిరోజుల క్రితమే కదా జీతం తీసుకున్నాడు. ఏదో రంగారావుగారి దయవల్ల ఆ సాయంత్రం నాలుగ్గంటలు తనషాపులో షైప్

Regd Trade Mark ఫోన్: 2217 తంతి: "డొవెటెక్స్"

DOVETEX
TRADE MARK

No. 162919 & 258010

# డొవెటెక్స్ కంపెనీ

(ఉత్పత్తిదారులు, రవాణాదార్లు)

బెడ్ షీట్స్-టవల్స్, ధోవతులు, టర్కీ జక్కార్డ్ టవల్సు మొదలైనవి, చేనేత బట్టలు మరియు నూలు వ్యాపారస్తులు.

నెం. 14, మహల్ 2 వ వీధి, మధురై (S.I.)

చేసినందుకు నెలకు ఎనభై రూపాయలు ఇస్తున్నాడు. ఇప్పుడు తిరిగి మళ్ళీ తన కవసరంకదాని ఎనభై రూపాయలు ఇమ్మంటే బాగుంటుందా. ఛ తనే తప్పు పని చేశాడు. ముందు ఫీజు అదీ కట్టేయవలసింది. తరువాత బాకీల సంగతి అదీ చూడవలసింది. పాపం ఆయన 'పంక్చువల్' గా సరిగ్గా నెల అవ్వగానే ఎనభై రూపాయలు తన చేతిలో పెడతాడు. ఇప్పుడు అడిగితే ఏమనుకుంటాడో.

రంగారావుగారు నాన్నగారికి స్నేహితుడే గాని, నిజంగా చెయ్యెత్తి నమస్కరించాలి. దేవుడులాంటి మనిషి. తన్నెంత ఆదుకుంటున్నారు. నలభైరూపాయలకు తనకో గదిచ్చి, రెండుపూటలా భోజనం, కాఫీ టిఫిన్ అన్నీ సమకూర్చుతున్నారు. తనకు తెలిసినతని షాపులో పార్ట్‌టైం జాబ్ చూపించారు. తమ కుటుంబమంటే ఎంత విశ్వాసం? ఒకప్పుడు నాన్నగారివల్ల ఆయన బాగుపడ్డాట. ఆయనిప్పుడు పోయినా ఆయనమీద అభిమానంతో తమమీద విశ్వాసం చూపిస్తున్నాడు.

"అసలు నువ్వు నాకేమీ ఇవ్వక్కర్లేదోయ్, మా ఇంట్లో భోంచేయ్, నీఇష్టమొచ్చినన్నాళ్లు నిశ్చింతగా ఉండొచ్చు. నీకు ప్రత్యేకంగా మేడమీద గది ఏర్పాటు చేశాను. నీ వక్కడ చదువుకోవచ్చు"—అన్నారాయన.

"అలాగే సార్ చాలా థాంక్స్. కాని మీరు మీ రూమ్‌కి ఎంతో కొంత తీసుకోవాలి అద్దె, మీ రడిగినంతే నివ్వలే ననుకోండి. ఏదో నా తాహతుకొద్దీ ఇస్తాను' అన్నాడు రఘు.

"అదేమిటోయ్. అద్దె ఇస్తానంటావ్. నువ్వేవరనుకున్నావ్. ఏమైనా పరాయివాడివా, నా కావల్సినవాడివి. నీదగ్గర అద్దె ఏమిటోయ్. అయినా నా దగ్గరే బోల్డు ములుగుతోంది. ఇంకా నీదగ్గర డబ్బు తీసుకోమంటావా."

"అదికాదు సార్, మీదగ్గర లేదని కాదు నేనంటున్నది. మీరు ఎంతో కొంత తీసుకోవాలి. నా సంతృప్తి కోసం" అంటూ బ్రతిమిలాడాడు రఘు.

"సరే నీకు తోచిందివ్వు" అంటూ వెళ్ళిపోయారు.

మొదటి నెలవ్వగానే నలభై ఇచ్చాడాయనకు ఇదేమిటోయ్ నీకు తోచిం దివ్వమంటే ఇంత ఎక్కువిచ్చేస్తున్నావ్ అన్నారాయన.

రఘు ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. అసలే తనిస్తున్నది చాలా తక్కువ, రెండు పూటలు భోజనానికి, గది అద్దెకు కలిపి నూరు రూపాయలు పైకి అవుతుంది. అలాంటిది తను నలభై ఇస్తే ఇంకా ఎక్కువంటున్నారేమిటీయన అనుకున్నాడు.

ఆయన తిరిగిచ్చేసినా తీసుకోలేదు రఘు. అప్పటినుంచి నెలనెలా నలభై ఇస్తున్నాడు.

ఆయ నెప్పుడో తన నాన్నగారివల్ల బాగుపడి ఉండొచ్చు. కాని ఆయన మేలు జ్ఞాపకముంచుకొని చితికిపోయిన తమ కుటుంబాన్ని ఆదుకొంటున్నాడు. ఆయన నిజంగా మానవత్వం మూర్తీభవించిన మనిషి. ఎంత కృతజ్ఞత తన స్నేహితునిమీద.

ఈకోజుల్లో ప్రతివారు అవసరంకోసరమై ఎవరినో ఆశ్రయించడమే కాని స్నేహభావంతో కాదు. తమ అవసరం ఉన్నంతవరకూ స్నేహితులం అంటూ చుట్టు తిరుగుతారు, ఆ పని అయిపోయి, అవసరం తీరిపోగానే మరి కన్పించరు. వారిని మర్చిపోవడమే. అంతా వ్యాపారంగా మారిపోయింది. అది స్నేహమా?

నిజమైన స్నేహ మంటే నాన్నగారిది రంగారావుగారిదీనూ. ఆయన పోయినాసరే ఆయన్ని మర్చిపోక ఆయన కుటుంబాన్ని ఆదుకొంటున్న రంగారావుగారు నిజమైన స్నేహితుడు. అటువంటి స్నేహితుడు దొరకడంకూడా కష్టమే. సంతోష సమయంలోనూ, చేతిలో కాగా

మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు!

అందానికి -

మన్నికకూ -




జయప్రకాష్ బనియన్లనే

వాడి సంతృప్తి పొందండి.

*

జయప్రకాష్ హొయిసరీస్,

తిరుపూరు - 2 (తమిళనాడు)

డబ్బున్నప్పుడూ, బెల్లం చుట్టూ చీమలు చేరినట్టు, స్నేహితులు, బంధువులు చేరటం సహజమే. కాని కష్టసమయంలో స్నేహితుని కష్టాలను ఆదుకొని వారిని ఓదార్చి వారి కష్టాలలో పాలుపంచుకొని, వాని దుఃఖాన్ని ఉపశమింపజేసేవాడే నిజమైన స్నేహితుడు, బంధువూను.

ఏమయినాసరే తన ప్రొప్రైటర్ని అడిగి చూడాలి, ఎవ్వరినీ అడగకపోతే ఎలా? పోనీ అడిగి చూడాం. తన అవసరం చూచి ఇచ్చినా ఇవ్వవచ్చు, ఏదో పరీక్ష ఫీజు కట్టేస్తే చాలు. ఈ సంవత్సరం గట్టెక్కినట్టే,

పాపం అమ్మ అక్కడెంత కష్టపడుతుందో, ఆ మిషను కుట్టవద్దమ్మా అంటే వింటుందా. అంత ఆయాసంతో కూడా అలాగే కుడుతుంది. ఏదో దానిమీద వచ్చే ఆ నలభైయ్యో, ఏభైయ్యో ఎందుకు పోగొట్టుకోవాలి అని తాపత్రయపడుతుంది. అంత కష్టపడి సంపాదించినా ఇంటిమీద అప్పుని కొంత కట్టేయాలి. నెలనెలా మిగిలిన దాంతో ఇల్లు గడుపుకోవాలి. పాపం తన చదువెప్పుడయిపోతుందా, తనెప్పుడుద్యోగస్థుడవుతాడా అని తనమీదే ఆశలు పెట్టుకుంది.

తన ఆలోచనలు ప్రక్కకునెట్టి రఘు వాచీ చూసుకున్నాడు, ఒంటిగంట కావస్తోంది. గబగబా రూమ్‌కి దారి తీశాడు.

* * * *

“సార్ మీరే సాయం చేయాలి సార్, మీరు కాదంటే నేనిన్నాళ్లు కష్టపడ్డ శ్రమంతా బూడిదలోపోసిన పన్నీరవుతుంది. ఎలాగైనా ఏనభైరూపాయలు సర్దుబాటు చేయండి సార్ మీరు తరువాత నా జీతంలో కట్ చేసుకోండి. పరీక్ష ఫీజు కట్టాలి సార్. మీ మేలు జన్మలో మరువలేను—”బ్రతిమాలాడు రఘు.

“ఏమిటయ్యా నువ్వు మరీనూ, పోనీ కదా ఏదో ఆ పెద్దమనిషి చెప్పాడుకదాని మాటతీసెయ్యలేక ఉద్యోగమిస్తే, మళ్ళీ మధ్యలో ఇదేమిటి? చనువిస్తే చంకకెక్కేలాగున్నావ్. మొన్న పదిరోజుల క్రిందటేకదా జీతం తీసుకున్నావ్”—విసుక్కున్నాడు ప్రొప్రైటర్.

హతాశుడయ్యాడు రఘు. తను కట్టుకొన్న ఆశాసౌధాలు కూలిపోయాయి. పోనీ రంగారావుగారన్నదుగుదామంటే ఆయన ఊర్లో లేడు. తను ఇన్నాళ్లు పడ్డ శ్రమంతా వృధా అయిపోతుందే. తను ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేసిన మొక్క పెరిగి చిగిర్చి ఫలవంతమయి అది అంతా సమయంలో చేజారిపోయినట్లయింది.

నలుగురైదుగురు స్నేహితుల్ని కూడా అడిగిచూశాడు. ఎక్కడికెళ్లినా మొండిచెయ్యెదురయింది. ఇంకాలాభం లేదు. ఎలాగైనా సరే సంపాదించాలి. అదే ఎలా సంపాదించాలనే ఆలోచనే మెదడ్ని కుమ్మరిపురుగులా దొలిచేస్తుంది, రఘు పిచ్చిగా తిరిగాడురోడ్లన్నీ. రోడ్డుమీద ఒక షాపుదగ్గర ఆగిన కార్లోంచి దిగాడో పెద్దమనిషి. తెల్లని పంచ కట్టేడు. దానిమీద గ్లాస్కో. గల్లీలాల్చీ. ఎర్రగా మాసిపోయిన రాగి గిన్నెలా ఉన్న బట్టతల. గోల్డ్ ఫ్రేమ్ కళ్ళజోడు. మనిషినల్లగా ఉన్నాడు. పెద్దబొజ్జ. బహుశా ఎవరో శెట్టిఅయ్యుండొచ్చు. గ్లాస్కో లాల్చిలోంచి అయిదురూపాయల నోట్లకట్ట మెరుస్తూ కన్పిస్తుంది.

కళ్లు జిగేల్మన్నాయి రఘుకి. ఇంక ఆలోచించి లాభంలేదు. ఏదోవిధంగా డబ్బుసంపాదించాలి. ఇప్పుడు ఫీజు కట్టకపోతే చదువంతా ఆగిపోతుంది. ఆఖరిదాకా వచ్చి చివరకి ఆఖరి దశలో అవాంతరం వచ్చేటట్లుంది, ఈ సంవత్సరం అయిపోతే తనూ దర్జాగా బ్రతకవచ్చు ఉద్యోగం చేసుకుంటూ. అతనిలో కోరిక పడగవిప్పింది. ఆశ తలెత్తింది. విచక్షణాజ్ఞానం నశించింది. ఏమిటోఅది తల్చుకొనేసరికే కాళ్లు చేతులు వణకడం మొదలు పెట్టాయ్. ఒళ్ళంతా ముచ్చెమటలు పోయటం మొదలెట్టాయి. ఏమయితే అయిందని నిశ్చయించుకున్నాడు. అతని జేబులో నోట్లకట్ట చేతపుచ్చుకొని పరుగు లంఘించేడు.

“దొంగ, దొంగ” అరిచేడు శెట్టి గొంతు చించుకొని అందరూ వెంటబడ్డారు పట్టుకోడానికి.

పరిగెత్తేడు, పరుగెత్తేడు అలసిపోయాడు బాగా. ఆయాసం విపరీతంగావస్తుంది. ఒక్కసారి బోర్లాపడ్డాడు రాయి తగుల్కొని. జనం నల్గురు మూగి నాల్గు తన్నులు తన్నారు. ఇంతలో పోలీసులొచ్చి చేతికి బేడీలు వేశారు. పదరా, నడు స్టేషన్‌కి అంటూ ఒక్కతోపు తోశాడు కాన్‌స్టేబుల్.

‘సారీ సార్ నేనుదొంగనుకానుసార్, నేనుదొంగను కాను” అంటూ పడ్డాడుక్రింద. కళ్లు తెరచేడు. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. చేతులు చూసుకున్నాడు. బేడీలులేవు. తను రూమ్‌లోనే ఉన్నాడు. ఒళ్ళంతా చెమటలు పట్టిఉన్నాయి.

“ఛ. వెధవ పీడ కల” విసుక్కున్నాడు.

టైమ్ చూశాడు నాల్గుగంటలయింది. గబగబాతయారయి బయల్దేరాడు షాపుకి.

* * * *

టైప్ చేస్తూన్న రఘు ప్రొప్రైటర్ పిలవడంతో వెళ్ళాడు. అక్కడో అమ్మాయి నిలబడి ఉంది. చూడానికి చాలా డబ్బున్నవాళ్ళ అమ్మాయిలాగానే ఉంది.

కాని డబ్బుగలవాళ్ల కుండే అతిశయం, గర్వం ఏమీ కన్పించటం లేదామెలో. తెల్లని పాలరాతి విగ్రహంలా వుంది. లేత నీలంరంగు చీరకట్టి అదే రంగు బ్లౌజ్ వేసింది. వదులుగా వేసిన వాలుజడ, మెడలో సన్నని బంగారు గొలుసొకటుంది. చూడగానే అతని మనస్సు సాకరించింది ఆమె రూపం. ఈమే నాభార్య అవుతేనో అన్న ఊహ కలిగింది. కాని తనెక్కడ, ఆమె ఎక్కడ ఇద్దరికీ ఏనుగుకీ, దోమకీ, ఆకాశానికీ, భూమికీ ఉన్నంత తేడా ఉంది అంతస్తుల్లో.

"చూడు రఘూ వీరికి బుక్సేవో కావాలిట తీసికెళ్ళి చూపించు" అన్న మాటలు విని ఊహాల్లోంచి బయట పడ్డాడు.

ఆమె బి. ఏ. ఫైనల్ చదువుతుంది. ఫైనలియర్ బుక్స్ ఏవో కొంది. అవికాక రెండు ఇంగ్లీషు నవల్సుకూడా కొంది. ఆమె తెచ్చిన పుస్తకాలపై పేరు చూశాడు రఘు టి. వి లక్ష్మి బి. ఏ. (ఫైనల్) అని ఉంది ఈమె పేరు లక్ష్మి అను మాట చక్కగా ఉంది పేరు. రూపానికి తగ్గ పేరు చక్కగా కుదిరింది, అనుకున్నాడు ఆమె వెళ్ళిపోయింది.

తిరిగి వచ్చేటప్పుడు బయటపెట్టాడు రఘు తనకోర్కెను అడగలేక, అడగలేక.

"ఓస్ దీనికేమటోయ్ ఇంత నసుగుతున్నావ్ అడగటానికి. ఎనభై రూపాయలేనా ఇంకేమయినా కావాలా" అన్నాడు.

"లేదండీ. ఎనభై చాలు" అన్నాడు రఘు.

"సరేనంటూ ఎనభై ఇచ్చాడు. తరువాత మెల్లగా తీరుద్దుగానిలే జాగ్రత్తగా చదువు."

పట్టలేనంత సంతోషం కలిగింది రఘుకు. తన పని ఇంత సులువుగా అయిపోయినందుకు. తనిలా అడిగిన వెంటనే ఇచ్చేస్తాడనుకోలేదు. ప్రొప్రైటర్కు ఎంతగానో కృతజ్ఞత తెల్పుకొని బయల్దేరాడు రూమ్కి.

* * *

పరీక్షలయిపోయాయి. రఘు అన్ని పేపర్లు బాగానే రాశాడు. ఆరోజే ఆఖరి పరీక్ష రాసి తిరిగొస్తున్నాడు ఫ్రెండ్స్తో కలసి.

"ఏరా, రఘూ ఎలా రాశావ్" అంటూ అడిగాడు వెంకటేశం.

"బాగానే రాశాన్రా" అన్నాడు.

ఆఁ వాడికేంట్రా ఫస్టుక్లాసొస్తుంది. వాడు నేను ఒకే రూమ్లో లేకదా-

పేపర్లు దస్తాలుకొద్దీ రాసి పడేశాడు మూడుగంటల్లోనే. అయినా పుస్తకాల పురుగు వాడు రాయకపోతే మనం రాస్తాముర్రా" అన్నాడు ప్రకాష్.

"ఒరే పేజీలు రాస్తే ఏముందిరా, మనకి మార్కులు, మార్కులు కొల్చి తూకంబట్టిఇవ్వరు మనం రాశిందాన్ని బట్టి"...అన్నాడు రఘు తేలిగ్గా తీసిపారేస్తూ.

"ఒరే ఇవాళ సినిమాకి పోదాంరా ఫస్టుషోకి, లీలాలో మంచి ఇంగ్లీష్ పిక్చరుంది." ప్రోగ్రాం వేశాడు సుందర్రావ్.

"ఓ యస్ రెడీ" అన్నాడు రఘు అందరికంటె ముందుగానే.

ఏమిటి ఇవాళ వీడంతట వీడే తయారవుతున్నాడు సినిమాకి. తప్పకుండా వెళ్ళాల్సిందే. అయితే యివాళ పెద్ద వర్షం పడ్తమో, లేకపోతే సినిమాలో కరెంట్ ఆగిపోవడమో తప్పదు" వేళాకోళం చేశాడు రవి.

"ఏం ముంచుకురాదుకాని, ముందు నువ్వు సినిమాకు వస్తావా, రావా అది చెప్పరా" అన్నాడు రఘు రవినుద్దేశించి.

"నేనా, నేను రాకపోవడమేమిట్రా, సినిమాకంటే నే ఫస్ట్" అన్నాడు రవి.

ఆరోజు స్కాలర్షిప్ తీసుకున్నాడు రఘు. అంచేత మిత్రులందర్నీ సినిమాకి తీసికెళ్ళాడు. ఆరోజు అంతా హాయిగా గడచిపోయింది స్నేహితుల్తో.

మర్నాడు రంగారావుగారివద్ద శెలవు తీసుకొని తన ఊరికి వెళ్ళిపోయాడు రఘు.

* * *

రఘూకు, ఆరోజు తను షాపులో చూచిన అమ్మాయికీ వివాహం జరిగిపోయింది. రఘును చూశాక, అతనికి ఆస్తి లేకపోయినా అతని చదువును, తెలివి తేటల్ని చూసి, ఆ అమ్మాయి తల్లీ తండ్రీ పెళ్లికి సమ్మతించారు.

"పిల్లాడికేం కన్నొంకరా, కాలొంకరా, శుభ్రంగా అందంగా ఉన్నాడు. అమ్మాయికి సరైన జోడు. పైగా పెద్ద చదువు చదువుకున్నాడు. తెలివి తేట లున్నాయ్, ఎటొచ్చీ డబ్బు లేకపోతే మాత్రం ఏం. తమకు బోలెడుందిగా" అని సరిపెట్టుకున్నారు.

రఘు ఆనందానికంతే లేదు. అంత అందమయిన అమ్మాయి తనకు భార్య కావటం నిజంగా తనఅదృష్టం. పైగా తనకేముందనీ? ఎమ్. కామ్. డిగ్రీ ఉంది. చిన్న ఇల్లు ఉంది, అదీ అప్పుల్లో ఉంది. అంతకంటె ఇంకేం లేదు. అయినా తనకి ఆస్తాఅంతస్తా. తన అంతస్తెక్కడా వాళ్ళంతస్తు ఎక్కడా. నిజంగా తనదృష్టం కాకపోతే అంత డబ్బున్న అమ్మాయి, అద్వితీయ సౌందర్యవతి

తన్ను చేసుకుంటుందా. రఘు మామగారు పెళ్ళి కాగానే హనీమూన్ ట్రిప్‌కై కాశ్మీర్ అవీ చూసిరావడానికై టిక్కెట్స్ బుక్ చేశారు.

రఘు, లక్ష్మి బయలుదేరారు తల్లి దగ్గర శలవు తీసుకొని. రఘు తల్లి ఎంతో ఉప్పొంగిపోయింది సంతోషములో. అంత అందమయిన అమ్మాయి, అణకువకలది తన కోడలైనందుకు.''

ఇద్దరూ ఢిల్లీ, కాశ్మీర్, శ్రీనగర్ మున్నగు ప్రదేశాలు చూశారు. ఆగ్రా వెళ్ళి తాజ్‌మహల్ దర్శించారు.

అదొక పచ్చని పచ్చిక బయలు. చుట్టూ కొండలు. ఆ ప్రదేశమంతా పూలచెట్లతో నిండిఉంది. ఆ పూల పరిమళాలు మత్తుగా వారి నాసికలకు సోకుతున్నాయి. ఇద్దరూ చేయి చేయి పట్టుకొని నడుస్తున్నారు. ఒక్కసారి ఆకాశంనిండా మేఘాలు క్రమ్మాయి. చిన్నతుంపర మొదలయింది. చుట్టూ చీకటి అలముకుంది. గట్టిగా ఒక పెద్ద ఉరుము ఉరిమింది. ఆమెగట్టిగా రఘుని కౌగలించుకుంది భయంతో.

"ఒరే రఘూ లేవరా. ఇంకా నిద్రేమిటి? అప్పుడే ఏడు గంట అయింది'' అంటూ తల్లి లేపించేసరికి కళ్ళు తెరచి చూశాడు చుట్టూను. తన గదిలో ప్రక్కమీద నున్నాడు ఎదురుగా తల్లి కన్పిస్తుంది.

"ఏమిట్రా అలా చూస్తావ్, లే, లే, ఏడు అయింది'' అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రఘు లేచి కూర్చున్నాడు ప్రక్కమీద. చ, ఇదంతా కలన్నమాట. చూసుకున్నాడు చేతిలో తలగడదిండుంది, బంగారంలాంటి కల పాడుచేసింది అమ్మ లేపించేసి...'' విసుక్కున్నాడు.

"ఒరే తొందరగా లేచి తెములు. నిన్ను చూడ్డానికి పెళ్ళివారొస్తున్నారు. ఎవరనుకున్నావ్ మీ మామయ్యే

మా హృదయ పూర్వకమైన దీపావళి అభినందనలు !!




♦ ఎలెక్ట్రిక్ మోటార్లు
♦ కాఫీ గింజలను రోస్ట్ చేసే యంత్రములు.
♦ కాఫీ గింజలను రుబ్బే యంత్రములు.
♦ నానపెట్టబడ్డ ఆహార ధాన్యాలను రుబ్బే యంత్రములు.
♦ చికరి మిక్సింగ్ మెషిన్స్.

ఈ యంత్రములన్నీ తయారుస్తున్నాము. మీకు కావలసినవాటికి ఆర్డరు ఇస్తే వెంటనే పంపగలము.

ఆంధ్రప్రదేశంలోని ఏజన్సీ షరతులకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

: వివరములకు :

Phone: 22430

JOTHI ENGINEERING WORKS

165, PATEL ROAD : : COIMBATORE-9

తన కూతుర్ని విజయను నీకిచ్చేసాడట. అంటూ హడావిడి చేసింది. ఇంకా లేవని తన కొడుకును చూసి.

"బిత్తరబోయాడు రఘు తల్లి మాటలు విని. ఏమిటి తమ ఆస్తి కాజేసి, ఈ స్థితికి దిగజార్చిన మామయ్య కూతుర్నా తను చేసికోవటం" ఆలోచనలో పడ్డాడు.

"ఇంకా లేవలేదురా" వంటింట్లోంచే అరచింది.

"ఆఁ ఆఁ లేచాను చాలా సేపయిందంటూ" గబగబా పెరట్లోకి దారితీశాడు.

* * * *

గత రోజు రఘు మామయ్య వచ్చాడు. ఒక్కసారి ఆశ్చర్యపోయింది జానకమ్మగారు. హఠాత్తుగా వచ్చిన తమ్ముడ్ని చూసి, తమ కుటుంబాన్ని సర్వనాశనం చేసి, తమ ఆస్తి కాజేసిన తమ్ముడిమీద చాలా కోపం వుండే దావిడకు. కాని చాలారోజుల తర్వాత వచ్చాడు. ఎంతైనా తమ్ముడుకదా పల్కరించింది. ముందు గుమ్మంలోంచే బయటికి పొమ్మందా మనుకుంది. కాని అలా చేయలేక పోయింది.

"ఏరా తమ్ముడూ ఇలా వచ్చావ్. అంతా కులాసా యేనా" అంటూ పల్కరించింది.

"ఆఁ కులాసాయేనక్కా" మా ఆవిడ పోయింది నీకు తెలుసా" అన్నాడు.

"ఆఁ తెలిసింది" అంది నిర్లిప్తంగా.

అక్క అలా తూచితూచి మాట్లాడ్డం చూచి అతనికి బాధేసింది.

"అక్కా నన్ను క్షమించక్కా, జరిగిందానికి నేనెంతో కుమిలిపోతున్నాను. దురాశకుపోయి మిమ్మల్ని నాశనంచేశాను. మిమ్మల్ని కష్టదశలో కూడా ఆదుకోలేకపోయాను. నా తప్పు క్షమించి, నాకూతురు విజయను నీ కోడలుగా చేసికో అక్కా. ఇది మనం వాళ్ళిద్దరూ చిన్నప్పుడే నిశ్చయించిన సంబంధం. ఎన్నాళ్ళనుంచో విడిపోయిన మన సంబంధం ఈవిధంగా తిరిగి ఒకటిగా చేయక్కా. అదంతా నీ చేతిలోనే వుంది. ఆస్తి అంతా రఘు పేరనే వ్రాసిస్తాను. కాని ఏ పాపం యెరగని విజయను శిక్షించవద్దు. నువ్వు క్షమించా లనుకుంటే విజయను రఘుకి చేసుకోవాలి" అంటూ కాళ్ళమీద పడ్డాడు.

జానకమ్మగారు కరిగిపోయింది పశ్చాత్తాపంతో దహించిపోతున్న తమ్ముడ్ని చూసి. తిరిగి ఆవిడకు తమ్మునిపై కోపం అంతా పోయి, జాలి, అభిమానం చిగిర్చాయి. లేరా, దానికింత ప్రాధేయపడాలా విజయను నా కోడలిగా చేసుకోవాలని నాకు మాత్రం లేదుట్రా తప్పకుండా చేసుకుంటా అంది. "అక్కా రేపు విజయను తీసుకొస్తా" అంటూ వెళ్లిపోయాడు.

♦ ♦ ♦

మొహం కడుక్కొని అమ్మా కాఫీ అంటూ పిల్చాడు రఘు.

"కాఫీ అందించింది" జానకమ్మగారు.

"అమ్మా మన్నింత హీనస్థితికి దిగజార్చిన మామయ్య కూతుర్ని ఎలా చేసుకోమంటున్నావమ్మా నే నలా చేయలేను."

'ఒరే రఘూ, నీకు తెలీదురా విజయ నిజంగా బంగారం బొమ్మనుకో చూస్తావుగా"

'కాని అందముంటే ఉండొచ్చు. కానీ ఆ దుర్మార్గుడికి కూతురేకదా. అమ్మా అయినా ఇన్నాళ్లు లేని సంబంధము ఇప్పుడొచ్చిం దన్నమాట.

"ఒరే మీ మామయ్య దుర్మార్గుడే అయినా, పాపం అన్నం పున్నం ఎరుగని విజయ ఏం చేసింది. ఆమెనా తండ్రి చేసినదానికి శిక్షించటం. ఆమె నీమీదే ఆశలు పెట్టుకుంది. అయినా మీ మామయ్య మారిపోయాడు ఇదివరకు జరిగినదానికెంతో పశ్చాత్తాప పడుతున్నాడు. పశ్చాత్తాపపడినవాడ్ని క్షమించడం మానవధర్మం."

"అయినా నాకు ఉద్యోగం అదీ దొరకాలా లేకపోతే ఆమెనుకూడా పస్తుపడుకోబెడదామా"

"ఒరె నీకేమిటిరా మీ మామయ్యకు బోలెడంత ఆస్తి వుంది, పెద్ద పలుకుబడిఉంది. మీ మామయ్యే చేయిస్తాడుద్యోగం నీకు."

* * * *

భాస్కరరావుగారు బాగా ఆస్తిపరుడు:-టువంటి ఆయన సామాన్య మధ్యతరగతి కుటుంబీకురాలైన జానకిని వివాహం చేసికున్నారు. కేవలం ఆమె అందం, గుణం, చూసే. అందుకే కాబోలు ప్రేమ గుడ్డిదంటారు. అసలు వారి అంతస్తుకూ, వీరి అంతస్తుకూ మధ్య భూమ్యాకాశాలు నడుమ నున్నంత, ఐరావతమునకు పిచ్చుకకు నున్నంత తేడా ఉంది. అయినాసరే భాస్కరరావుగారు అంతస్తులను లెక్కచేయకుండా తను ప్రేమించిన జానకినే వివాహం చేసికొన్నారు. వారి వివాహం గుడిలో జరిగింది. అసలు పరిచయంకూడా గుడిలోనే జరిగింది. క్రమంగా అది స్నేహంగాను, తరువాత ప్రేమగా మారింది. అతని తల్లి సుశీలాదేవి జానకి గుణగణాలు, అందం చూసి, ఇష్టపడింది. అప్పటికే ఆయన తండ్రి మరణించడంతో భాస్కరరావుగారిని కంటికి రెప్పలా కాపాడి పెంచి పెద్దచేసింది. "పిల్ల మంచి గుణవంతురాలు, అందంవుంది. డబ్బులేకపోతేనేం, అడిగాకుండా

కాదుకు అతని ఇష్టం కాదనేందు కూడదనాలి" అని ఆవిడ మనస్ఫూర్తిగానే అంగీకరించింది.

జానకి తండ్రి రామనాథ శాస్త్రిగారు. పాతకాలం మనిషి. పూర్వాచార పరాయణుడు ప్రొద్దుటే నాలుగు గంటలకే లేచి, కాలకృత్యములు ముగించి, స్నానమాచరించి, సంధ్యా జపతపాదులు ఎనిమిది గంటలవరకు చేస్తారు. అంతవరకు కాఫీయేకాదు, పచ్చి మంచి నీళ్ళయినా ముట్టడు. ఆయన మాటకు తిరుగులే దాయింట్లో. ఆయనఆజ్ఞ సుగ్రీవాజ్ఞే. ఆయన కిద్దరుపిల్లలు. పెద్దమ్మాయి జానకి. రెండవ అబ్బాయి చలపతి. అటువంటి ఆయన జానకి ఎవరినో ప్రేమించి, గుళ్ళో పెళ్ళిచేసుకుందని వినడంతోటే అగ్గిమీద గుగ్గిలం వేసినట్లు మండిపొయ్యారు. తోకత్రొక్కిన తాచులా ఎగిరిపడ్డారు.

ఆశీర్వదించమని వచ్చిన లక్షాధికారి అల్లుడిని, తను అల్లారుముద్దుగా పెంచినకూతురు జానకిని నిర్దాక్షిణ్యంగా బయిటికి గెంటేశారు ఇంక యీ ఇంట్లో నీకు స్థానం లేదు పొమ్మంటూ. ఆయన సాంప్రదాయాల పట్టింపు మనిషి.

భాస్కరరావుగారు చాలా నెమ్మదస్థుడు. జా. కి తన తండ్రి చేసిన అవమానానికి ఆయన తరఫున క్షమాపణ వేడింది. "అదేమిటి జానకి ఆయన అసలే పూర్వకాలం మనిషి. ఏవో పెద్దవాళ్ళ పట్టింపులుకొద్ది ఏవోఅన్నారు. అందులో మీ నాన్న అసలే చాదస్తం మనిషి. ఆయన మాటలు నేనేం పట్టించుకోనులే"...ఓదార్చారు.

ఆ రోజుల్లో భాస్కరరావుగారు అడిగినవారి కివ్వటంలో ఆయన చేతికి ఎముకలేదనే చెప్పుకొనేవారు. అంతటి ఉదారబుద్ధి కలవా రాయన. ఎవ్వరైనా తన్ని సహాయం అడగడమే ఆలస్యం అన్నట్లు అడిగిన ప్రతివారికి తన చేతనైన సహాయం చేసేవారు.

ఒకరోజు ఆయన చిన్ననాటి మిత్రుడు రంగారావు వచ్చాడు. ఆయనెంతో ఆదరించి, నాలుగురోజు లుంచేశారు బలవంతాన.

"ఒరె మా నాన్నగారు పేకాట్లకి, దానికి చేసిన అప్పుల్తో, ఇప్పుడు వ్యాపారం మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు నన్ను నువ్వే ఆదుకోవాలి"... అంటూ బ్రతిమాలేడు ఓరోజున.

"ఒరె దీని కింతగా బ్రతిమలాడాలిట్రా, అయినా స్నేహితుడవుకదా మనలో మనం సాయం చేసికోపోతే ఎలాగ అంటూ పాతికవేలు ఇచ్చారు." రంగారావు కళ్ళు కృతజ్ఞతతో మెరిసాయి. ఆయన సాయంతోనే తన వ్యాపారాన్ని వృద్ధిచేసికొన్నాడు.

ఎంతోమంది ఆయన దగ్గర వేలకువేలు విరాళాలు, కొంతమంది అప్పుక్రింద తీసుకెళుతూనే ఉంటారు. కా





మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు

బనియన్ల తయారీలలో మాదొక ప్రత్యేకత.

అందుకే....

టిప్ టాప్ బనియన్లు

నాణ్యమునకు ప్రసిద్ధి చెందియున్నది.

దీపావళి పండుగకు "టిప్ టాప్" బనియన్లు కొని ధరించి ఆనందించండి.

: తయారించువారు :

Phone : 885

TIP TOP HOSIERY MFRS,

35/28, DHARAPURAM ROAD : TIRUPUR-4.

దాని సంగతి ఆయన తిరిగి ప్రశ్నించరు. వారు తిరిగి ఇవ్వరూ. అది మామూలయిపోయింది.

చలపతి భార్య పట్టి డబ్బు మనిషి. ఆ ఊర్లో ఎంతో మంది భాస్కరరావుగారివల్ల బాగుపడి వ్యాపారం చేసుకుంటూ వేలకివేలు గడిస్తున్నారు.

"ఏమండీ మీ బావగారిదగ్గ రంత డబ్బు ఉందిగదా అందులో ఆయన ధర్మాత్ముడట. అడిగిన వాళ్ళకి లేదనకుండా ఇస్తారట కదా చూడండి ఆయన దగ్గరనుంచి తీసుకొని మన ఊర్లో ఎంతమంది బాగుపడుతున్నారో. మీరుకూడా వెళ్ళి ఆయన సాయంతో ఏదైనా వ్యాపారం చేస్తే బాగుంటుంది కదా. ఎన్నాళ్ళనీ గుమాస్తా జీతం ఎదుగుబొదుగు లేకుండా" అంటూ పోరుపెట్టింది.

"మేం సంబంధం లేదని వాళ్ళని వదిలేసుకున్నాం. ఎన్నాళ్ళనుంచో రాకపోకలు లేవు. మనకు వాళ్ళకు అటువంటిది ఇప్పుడెళ్ళి అడుగుతే బాగుంటుందా అన్నాడు చలపతి.

"బాగుందండీ మీరెవరయినా పరాయివాళ్లా ఏమన్నానా. ఇంట్లోంచి పొమ్మని తగిలేసింది చాదస్తం మనిషి మీ నాన్న, అమ్మానూ. ఇప్పుడు వాళ్లిలాగూ లేరు. ఆయన చాలామంచివాడట. అయినవాళ్లను కాదంటారా ఎవరైనా. మునుపు రాకపోకలు లేకపోయినా ఇప్పట్నించే మొదలవుతుంది వెళ్లండి" అంది.

చలపతి భయపడ్డాడు ఏం అవమానంపాలు కావలసి వస్తుందోనని, కాని అతని ఊహ తలక్రిందైంది. అతననుకున్నట్టు ఎవ్వరూ అతన్ని అవమానం చేయలేదు. నిష్ఠూరమూ ఆడలేదు. పైగా ఎంతో ఆదరించేరు, విడిపోయిందనుకున్న తమ సంబంధం తిరిగి మొగ్గ తొడిగినందుకు ఎంతో ఆనందించేరు.

అతను చూస్తుండగానే ఆయన విరాళాలు మొత్తం ముప్పైవేలదాకా ఇవ్వటం చూసేసరికి చలపతి కళ్ళు జిగేల్మన్నాయి. అంత డబ్బు ముప్పైవేలు తను జీవితాంతం కష్టపడ్డా సంపాదించలేనంత డబ్బు. అతను ఊరికే విరాళంగా ఇచ్చేశాడు. ఎంత దాతృత్వం. మనసులోనే మెచ్చుకున్నాడు బావగార్ని.

ఒకరోజు "అక్కయ్యా బావగారేదయినా సహాయంచేస్తే, ఏదయినా వ్యాపారం చేద్దామని ఉంది."... అంటూ తన కోరికను బయటపెట్టాడు.

"అలాగే మీ బావగారు కేంప్ వెళ్లారుకదా, ఆయన వచ్చాక అడుగుదువు గాని"

భాస్కరరావు కేంపునుంచి రాగానే జానకి తమ్ముడి కోరిక భర్తతో చెప్పింది... చలపతికూడా అడిగాడు.

"అదేమిటోయ్ చలపతీ నీకు వ్యాపారం చేయాలనుంటే వేరె ఎందుకూ. మా క్లాత్ మిల్సులోనే నీకు సగం వాటా ఇస్తాను. ఇకనుంచి మేనేజిమెంటు అదీ నువ్వే చూసుకో. నే హాయిగా రెస్టు తీసుకుంటాను"... అన్నారు భాస్కరరావుగారు.

"చూస్తారుగా మీరే'—అన్నాడు పొంగిపోతూ.

క్లాత్ మిల్సులో సగం వాటా అంటే సుమారు ఇరవైలక్షలు దాకా ఉంటుంది. అంత పెద్ద మిల్సులో సగంవాటా తన కిచ్చేసిన బావగారి దాతృత్వానికి ఉబ్బితబ్బిబ్బైపోయాడు చలపతి.

చలపతి, భార్యా మకాం మార్చేశారు వాళ్ళవూరు నుంచి బావగారింటికి. అందరూ కలసే ఉంటున్నారు. జానకీ, భాస్కరరావుగారిద్దరూ ఎంతో సంతోషించేరు. తిరిగి అందరూ కలుసుకున్నందుకు.

చలపతి భార్య "వదినా, వదినా అంటూ అప్యాయత వలకబోయటం మొదలెట్టింది జానకిమీద.

చలపతికి ఒక్కసారి ఐశ్వర్యం కలగటంతో కళ్లు మీద కెళ్లాయి. ఇంకా సంపాదించాలి అనే దురాశ కలిగింది. మిల్లులో డబ్బు అదీ ఎగవేసి తన వెనకవేయటం మొదలెట్టాడు.

"బావగారూ మీరు మరి అంతంత డబ్బు ఊరికే విరాళాలు క్రింద ఇచ్చేస్తే ఎలాగండీ. మనకెంత ఇస్తే మాత్రం తరుగుతుందా, అయినా కొంత ముందు జాగ్రత్త అవసరం" ఉచిత సలహా పారేశాడు చలపతి.

"చూడు చలపతీ" మనకి డబ్బు చాలా ఉంది. మనం ఏం చేసుకుంటామయ్యా అదంతా. మనం చచ్చాక ఇదేమయినా వెంటవస్తుందా. ఏదో మనకున్నదాంట్లో ఇంకొకళ్లకి సాయం చేసినవాడే మనిషనిపించుకుంటాడు. స్వార్థంతో దొరికిందంతా దోచుకొని వెనకేసుకుంటే మనిషికీ జంతువుకి తేడా ఏమిటి?

ఆ మాటలు చలపతికి చురకలా తగిలాయి. నోరు మూసుకున్నాడు మరెప్పుడూ అటువంటి సలహాలు ఇవ్వలేదు.

చలపతి డబ్బు వెనకేసిన డబ్బు పెరగజొచ్చింది. అతనికి ఆశకూడా అదేవిధంగా పెరుగుతోంది. దురాశ మానవుడ్ని అధోగతికి దిగజార్చుతుంది. యుక్తావిచక్షణా జ్ఞానాన్ని నశింపజేస్తుంది. ఆ దురాశావలయంలో చిక్కుకున్నవాడు పశువుకన్నా హీనుడవుతాడు.

తనను ఏమీ లేనివాడ్ని తీసుకొచ్చి అధికార్ని చేసిన బావగారిపై కృతజ్ఞతకూడా విస్మరించి, తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టేందుకు సిద్ధమయ్యాడు చలపతి.

భాస్కరరావుగారికి కేన్సరువ్యాధి వచ్చింది. దాంతో ఆయన చిక్కి సగమయ్యాడు, ఆయన వ్యవహారాలు అన్నీ చలపతి చూస్తున్నాడు. ఆయనజబ్బుకి ఎంతో పెద్దపెద్ద డాక్టర్లకు చూపించారు. కాని లాభంలేకపోయింది. క్రమంగా ఆయన భూములు అన్నీ అమ్మడయిపోయాయి అందులో సగానికిపైగా చలపతికి చేరిపోతోంది. ఆయన మందులకే ఎంతో డబ్బు ఖర్చయిపోయింది: ఆస్తిఅంతా పోయినాసరే ఆయన్ను బ్రతికించుకోవాలని నిశ్చయించుకొంది జానకి. కాని విధి వక్రించింది. ఆయనకు తగుముఖం పట్టలేదు. చలపతి ఆలోచించి ముందు జాగ్రత్తపడ్డాడు. ఆయనచేత ఏవో ఆఫీసు కాగితాలంటూ దస్తావేజులమీద సంతకం పెట్టించేశాడు విల్లు తనకే వ్రాసినట్లుపూర్తిగా. క్రమంగా ఆస్తిఅంతా కాజేశాడు ఇల్లుతో సహా. పాపం భాస్కరరావుగారు కన్ను మూసారు. ఇంకేముంది జానకికి లోకమంతా చీకటిమయమయ్యింది. జీవితంశూన్యమయంగా కనిపించింది. తన్నంతగా ప్రేమించిన భర్త లేనప్పుడు ఇంక జీవించటం వ్యర్థం అనుకుంది. కాని నాలుగేండ్ల రఘు దిక్కులేనివాడయిపోతాడే ఆమెకు గాఢాంధకారంలో కాంతికిరణంలాగ రఘు కన్పించాడు వీడ్ని చూశయినాసరే తను జీవించాలి, వీడికోసం తను జీవించాలి. వీడ్ని అభివృద్ధిలోకి తేవాలని నిశ్చయించుకొంది.

భాస్కరరావుగారు పోగానే జానకి చలపతికీ, భార్యకు కూడా అలుసయిపోయింది. అవును డబ్బు లేకపోతే అలుసేమరి. ఒకనాడు తనదగ్గర మాట్లాడటానికే భయపడిన చలపతీ, భార్యా ఈనాడు తనమీదే అధికారం చలాయిస్తున్నారు విధిలిఖితం.

చలపతి చేసిన అన్యాయం తెలియగానే జానకికి విపరీతమైన కోపం కల్గింది. ఛీ! వీడు తన తమ్ముడా, తిన్న యింటివాసాలు లెక్కపెట్టే విశ్వాసఘాతకుడు. పాముకు పాలుపోసి పెంచితే, తిరిగి వాడ్నే కాటేస్తుంది. వీడ్ని చేరదీసి ఆదరిస్తే తిరిగి తమకే ద్రోహం చేశాడు. వీడిలో ఇంతవిషం దాగిఉందని ముందే తెలుస్తే ఆదరించక పోయుండేది. కుక్కకయినా ఇంత తిండిపెడితేవిశ్వాసం ఉంచుకొంటుంది. తన డబ్బు ఆస్తి కాజేసి తన్నింట్లో పనిమనిషికన్నా హీనంగా చూస్తున్నారు. పైగా "లేనిపోని సంత అంతా మానెత్తిన పడ్డది' అంటూ చలపతి భార్య సణుగుడు. జానకి 'ఆ సూటీ పోటీ మాటలు సహించలేకపోయింది, ఛీ! ఈ యింట్లో ఈ మనుష్యుల మధ్య ఉండేకంటే బయట అడుక్కుతింటే నయం" అని నిశ్చయించుకొంది.

తరువాత చలపతి చేసిన ఇన్సూరెన్సు డబ్బువచ్చింది. దాంతో ఒక చిన్న యిల్లు కొనుక్కొని మిగతాది బ్యాంకులోవేసి దానిమీద వచ్చే వడ్డీతో ఏదో గుట్టుగా గడుపుకొచ్చింది. ఆ డబ్బు కాజేద్దామని ఏదో అభిమానంగా మాట్లాడటం మొదలెట్టాడు చలపతి. కాని ఆవిడ వారితో సంబంధం తెగతెంపులు జేసుకొంది. అప్పటి నుంచి వారికి వీరికి రాకపోకలు, సంబంధాలు నిల్చిపోయాయి. ఓ కుట్టుమిషన్ ఒకటి కొనుక్కొని ఏదో దాని మీద వచ్చే డబ్బుతో రఘును ఎమ్.కాం. దాకా చదివించింది. రఘు చురుకైనవాడుకావటంచేత ప్రతిక్లాసులోను ఫస్టున ప్యాసవుతూ వచ్చాడు స్కాలర్‌షిప్పు తెచ్చుకుంటూ.

♦ ♦ ♦

రఘు ఆలోచన్లో పడ్డాడు. తన మనస్సంతా ఇదివరకు షాపులో కన్పించిన అమ్మాయిపై లగ్నమయింది. కాని ఆమె ఎవరో ఏమిటోకూడా తెలియదు. కాని ఆమె తన్ను చేసుకుంటుందని నమ్మకమేమిటి? తనకు ఏముందని ఏమి చూసుకొని చేసుకుంటుంది. ఆమెకోసం ఆలోచిస్తూ కూర్చోడమా లేకపోతే కోరి ఇసాకన్ను మానాయ్యా



కూతుర్ని చేసుకోడమా. మామయ్య కూతుర్ని చేసికొంటే తద్వారా ఆ స్తి అంతస్తు కూడా తనకు లభిస్తుంది.

కాని మామయ్య తను కెంత ద్రోహం చేశాడు. అటు వంటివాని కూతుర్ని తను వివాహం చేసుకోడమా? బాధ కల్గింది రఘుకి.

మామయ్య దుర్మార్గపుపని చేశాడు కాని దానితో విజయ కేమి సంబంధం. కేవలం అతని కడుపున పుట్టి నంతమాత్రాన తనమీద ఆశలు పెట్టుకొన్న విజయ కన్యాయం చేయడం భావ్యంకాదనిపించింది.

మామయ్య మూర్ఖుడే, దుర్మార్గుడే కావొచ్చు. కాని అతని కడుపున పుట్టినంత మాత్రాన ఆమె దుర్మార్గురా లెలా అవుతుంది "ఎంతో అందంగా వున్న పద్మం బుర దలో పుట్టటంలేదా? ఎందుకు పనికిరాని మామూలు రాళ్లు పుట్టిన చోటే ఎంతో పవిత్రమైన పూజార్హమైన సాలగ్రామాలు పుట్టడంలేదా!"

ఆ ఊహాసుందరి గూర్చి ఆలోచించడం అందని దాని కోసం అర్రులు చాస్తున్నట్లేఉంది. లభ్యం కానిదాని కన్నా, మనకు సుదూరంలో ఉన్నదాన్ని పొందటానికి ప్రయత్నించడంకన్నా అవివేక మింకేముంది. కాని ఆమె తన మనస్సు నాకర్షించింది. తను మరచిపోవడం దుర్లభ మన్పిస్తుంది. ఆమె అద్వితీయ సౌందర్యం పదేపదే గుర్తు కొస్తుంది.

పెళ్ళిచూపుల్నాడుచూశాడు ఒక్కక్షణం విజయను ముదకపట్టుచీర ముదర రంగుది కట్టుకుంది. ఒంటినిండా నగలు పెట్టుకుని మొగలిజడ కట్టుకొని ముక్కుకి, చెవు లకి ఆభరణాలు ధరించి, సిగ్గుతో ముడుచుకొని తలదించు కొని చాపమీద కూర్చొంది. తను సరిగ్గా చూడలేకపో యాడు ఆ అలంకారాల మధ్య. ఏమిటో గంగిరెద్దుకు చేసినట్లు అలంకరిస్తే వచ్చేస్తుందా అందం. "ఒరిజనల్ బ్యూటీ" ఉండొద్దూ. ఎలాగా పెద్దవాళ్లు నిశ్చయించే శారు. అని తనుకూడా 'సరే' నంటూ ఒప్పుకున్నాడు రఘు. విజయ వివాహం బ్రహ్మాండంగా జరిగిపోయింది.

ఆ రాత్రి శోభనం. దంపతులకు అన్యోన్యత కలిగించే తొలిరాత్రి. జీవితాంతం మరపురాని మధురమైన రాత్రి. మేడమీదగదిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు చలపతి గారు. ఆగది తెల్లటి మెర్క్యూరీ దీపాలతో తళతళ మెరసి పోతోంది. ఆ గదినిండా అగరొత్తులు సుగంధి పరిమ ళాలు వెదజల్లుతున్నాయి. పందిరిమంచంపై వ్రేలాడు తున్న మల్లెల తెరలు విచ్చుకొని వుండి మత్తుగా పరిమ ళాలు వెదజల్లుతున్నాయి. ఆ విచ్చుకొన్న మల్లియలు తెల్లగా మెరుస్తూ ఆ నవదంపతుల నిష్కల్మష, సుతి మెత్తని హృదయాలకు ప్రతీకగానున్నాయి. చందమామ ఆ నవదంపతుల అన్యోన్యత తిలకిద్దామని కాబోలు మబ్బులనుండి చీల్చుకొని బయటపడ్డాడు.

రఘు ఒంటరిగా ఆ గదిలో తన ప్రేయసి, హృదయ సామ్రాజ్ఞి అయిన విజయరాకకై ఎదురుచూస్తున్నాడు. ఆమె సాంగత్యంలో పొందే మధుర ఘడియలకోసం నిముస మొక యుగంగా గడుపుతూ నిరీక్షిస్తున్నాడు.

ఇంతలో బయట కలకలం బయలుదేరింది వరండా మీద. అమ్మలక్కలు విజయను తీసుకొచ్చి హాస్యాలు ఆడుతూ గదిదగ్గర దిగవిడిచి, తలుపులు బిగించి వెళ్ళిపో యారు. విజయ సిగ్గుతో మొగ్గవలె ముడుచుకు పోయింది. ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. రఘు పలకరిస్తా డనుకొంది. కాని తిరిగే చూడలేదతను. తనే ముందు పలకరించాలని కాబోలు అటు తిరిగి కూర్చున్నాడు అనుకుంది. మెల్లగా అడుగులు తడబడుతూండగా నడచి అతన్ని సమీపించింది. గ్లాసులో పాలు అందించింది.

దగ్గర కొచ్చిన విజయను పరీక్షగా చూశాడు రఘు. ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. అతని ఆనందం వర్ణనా తీతం. తనకు మాపులో కనుపించి, కలలో తనతో విహ రించిన అందాల సుందరి తన యెదుటే ప్రత్యక్షమయ్యిం దీనాడు. ఆరోజు కట్టుకున్న చీర. జాకెట్టు, గొలుసు ధరించింది సింపిల్ గా, జడ ఆరోజులాగే వదులుగా వేసి కొంది. ప్రొద్దుటే తలంటి స్నానం చేసిందేమో. ఆమె జుత్తు ముంగురులు ఎగిరి ఆమె బుగ్గలని తాకుతున్నాయి.

రఘుకి చెప్పలేనంత సంతోషంలో ఉన్నాడు. తను కావాలనుకున్న సుందరి తనకు దొరికింది. తనకు కలలో కన్పించిన సుందరి ఈమేనా. ఈమె మామయ్యకూతురా ఛ. 'ఈ మధురమైన ఘడియల్లో అతన్ని తల్చుకోవడ మేమిటి అనుకున్నాడు. ఏమైనా తన కల నిజమైంది. ఉప్పొంగిన ఆనందంతో కౌగలించుకున్నాడు విజయ లక్ష్మిని. ఆ నవనూతన దంపతుల హృదయాలు క్షణంలో ఏకమయి, ఆనందసాగరంలో తేలియాడుతున్నాయి. చందమామ వాళ్ళ అన్యోన్యతకు భంగం కల్గించటం ఇష్టంలేక, వారికి అనుకూల వాతావరణం కల్పించాలని చల్లగా మబ్బులచాటుకి తప్పుకున్నాడు సిగ్గుపడుతూ.

'కథాంజలి' లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులము కాదు. —సంపాదకుడు